క్రిమినల్ కేసులపై దృష్టిసారించాలి

శ్రీకాకుళం లీగల్ : సెప్టెంబరు 14వ తేదీన నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీపడ దగిన క్రిమినల్, ఎక్సైజ్ కేసులపై దృష్టిసారించాలని జిల్లా జడ్జి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా సూచించారు. స్థానిక జిల్లా కోర్టు భవనంలో పోలీసు, ఎక్సైజ్ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలన్నారు. కక్షిదారుల మధ్య రాజీయే రాజ మార్గమని, దీని ద్వారా ఇరువురికీ న్యాయం చేకూరుతుందన్నారు. సమావేశంలో నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎస్.ఎం ఫణికుమార్, న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, ఎఎస్‌పి ప్రేమ్ కాజల్, ఎక్సైజ్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సిహెచ్.సత్యనారాయణ, నాగభూషణరావు పాల్గొన్నారు.

నామినేటెడ్‌పై ఆశలు

- ఎమ్మెల్యేల నుంచి భారీగా సిఫార్సు లేఖలు
- అందరి దృష్టి డిసిసిబి పీఠంపైనే
- కాపు సామాజిక తరగతికే దక్కుతుందన్న ప్రచారం
- ప్రధాన రేసులో కలమట, ఆనెపు

నామినేటెడ్ పోస్టులను ఆగస్టు 15 తర్వాత ప్రకటిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పడంతో అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. జిల్లాలో ఎవరెవరికి పదవులు దక్కుతాయనే చర్చ టిడిపి కేడర్‌లో సాగుతోంది. గతంలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు అన్ని పదవులూ ఆ పార్టీ నాయకులకే దక్కాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో టిడిపితో పాటు జనసేన, బిజెపి నాయకులూ పదవులు ఆశిస్తున్నారు. దీంతో పోటీ మరింత ఎక్కువైంది. నామినేటెడ్ పోస్టులకు సంబంధించి ఇప్పటికే ఎమ్మెల్యేల నుంచి సిఫార్సుల జాబితా వెళ్లినట్లు తెలుస్తోంది. వారిలో ఎవరికి కూటమి ప్రభుత్వం పట్టం కట్టనుందో అని అంతా ఎదురుచూస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

నామినేటెడ్ పోస్టుల్లో రాష్ట్రవ్యాప్త స్వభావం కలిగినవి, జిల్లాకు పరిమితమైన కొన్ని ముఖ్యమైన పదవులూ ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పలురకాల కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల పదవులు ఉన్నాయి. జిల్లాకు సంబంధించి డిసిసిబి, పిఎసిఎస్ కమిటీలు, డిసిఎంఎస్ చైర్మన్లు, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్లు వంటి పదవులు ఉన్నాయి. వీటిలో డిసిసిబి పీఠంపైనే అందరి దృష్టి నెలకొంది. కోపరేటివ్ బ్యాంకులు, సహకార సంఘాల ద్వారా రైతులకు రుణాలు, ప్రోటోకాల్, ముఖ్యమైన సమావేశాలకు ప్రత్యేక ఆహ్వానితుడిగా గౌరవం వంటి ప్రాధాన్యత పోస్టు కోసం ఎవరి స్థాయిలో వారు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

కాపు సామాజిక తరగతికే పీఠం దక్కవచ్చంటూ విస్తృతంగా ప్రచారం సాగుతోంది. అందుకు కారణాలూ లేకపోలేదని పలువురు నాయకులు చెప్తున్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా డిసిసిబి చైర్మన్ పదవిని కాపులకే కేటాయిస్తూ వస్తోంది. అదీగాక సార్వత్రిక ఎన్నికల్లో కూటమి సీట్ల కేటాయింపులోనూ కాపు సామాజిక తరగతికి అన్యాయం జరిగిందన్న ఆవేదన ఆ తరగతిలో ఉంది. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ సీట్లలో కాపులకు రెండు సీట్లను కేటాయించే పరిస్థితి ఉండగా, ఈసారి ఎన్నికల్లో పాతపట్నంలో మాత్రమే ఆ తరగతికి చెందిన ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు ఇచ్చారు. ఎచ్చెర్ల స్థానాన్ని ప్రతిసారీ కాపులకు కేటాయించినా, ఈ పర్యాయం కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటులో భాగంగా కమ్మ సామాజిక తరగతికి చెందిన ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావుకు ఇచ్చారు.

ప్రధాన రేసులో కలమట, రామకృష్ణ

ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు ఆనెపు రామకృష్ణ, టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణతో పాటు సరుబుజ్జిలి టిడిపి నాయకుడు శివ్వాల సూర్యనారాయణ, కొత్తూరు మండల టిడిపి నాయకుడు ఎల్.తులసీవరప్రసాద్ తదితరులు ప్రధానంగా రేసులో ఉన్నారు. పార్టీ కోసం తాము కష్టపడ్డామని, తమకే పదవులు వస్తాయన్న ఆశాభావంతో అంతా ఉన్నారు. పాతపట్నం మాజీ ఎమ్మెల్యేకలమట వెంకటరమణకు ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ టిక్కెట్ ఇవ్వకపోవడంతో ఆయన ఎన్నికల సమయంలో అలకబూనారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలాస ఎన్నికల ప్రచార సభకు వచ్చిన సందర్భంలో ఆయన్ను బుజ్జగించి, టిడిపి జిల్లా అధ్యక్ష పదవిని సైతం కట్టబెట్టారు. ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వనందున తనకు చైర్మన్ పదవి రావచ్చని ఆశిస్తున్నారు. అయితే కొన్ని అంశాలు ఆయనకు ప్రతికూలంగా మారాయన్న చర్చ నడుస్తోంది. ఎన్నికల సమయంలో టిడిపి టిక్కెట్ నిరాకరించడంతో ఆగ్రహంతో రెబల్‌గా దిగుతానంటూ పార్టీని బ్లాక్ మెయిల్ చేశారన్న విమర్శలున్నాయి. దీంతోపాటు కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును తీవ్రంగా దూషించారు. ఎంపీగా రామ్మోహన్ నాయుడు గెలవకుండా అచ్చెన్నాయుడు ప్రయత్నిస్తున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేయడం వంటి అంశాలు ఆయనకు ఇబ్బందికరంగా మారొచ్చనే చర్చ సాగుతోంది.

అధిష్టానం కరుణ ఎవరిపైనో..!

ఎమ్మెల్యేల నుంచి కొన్ని సిఫార్సులు వెళ్లగా, వ్యక్తిగతంగా కొందరు తమ పేర్లను పరిశీలించాలని కోరుతూ ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆనెపు రామకృష్ణ వంటి వారు నేరుగా తమ బయోడేటాలను అందించినట్లు తెలుస్తోంది. పార్టీకి 24 ఏళ్లుగా అందించిన సేవలు, చేపట్టిన పదవులు, పార్టీపరంగా చేపట్టిన కార్యక్రమాలు తదితర అంశాలతో కూడిన తన బయోడేటాను ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబుకు రామకృష్ణ అందించినట్లు తెలిసింది. 2023 ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అరాచకాలను ఎదురొడ్డి ఒత్తిళ్లు వచ్చినా ఇండిపెండెంట్‌గా బరిలో దిగారు. పార్టీలో ఎవరికి ఎక్కువ కేసులు ఉంటే వారికే పదవులు వస్తాయంటూ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చెప్పినట్లు, తమ నాయకునిపై ఏకంగా 18 కేసులు ఉన్నాయని గుర్తు చేస్తున్నారు.

అంతర్రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కృషి

ఇచ్ఛాపురం, చీకిటి ఎమ్మెల్యేలు అశోక్, మనోరంజన్

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఆంధ్రా - ఒడిశాలోని ఇచ్ఛాపురం, చీకిటి నియోజకవర్గాల్లోని సరిహద్దు గ్రామాల్లో సమస్యలను ఉమ్మడిగా పరిష్కరించుకుని, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు బెందాళం అశోక్, మనోరంజన్ ధ్యాన్ సమంత్ర నిర్ణయించారు. ఇచ్ఛాపురంలోని కంచ్రవీధి సుమండి కూడలి వద్ద శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు సమన్వయంతో ముందుకెళ్తామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల స్థాయిలో కలిసి కూర్చొని సమస్యలు పరిష్కారం చేసుకుంటామని చెప్పారు.

సరిహద్దు ప్రాంతాల్లో రోడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు

ఇచ్ఛాపురం మున్సిపాల్టీలోని కంచ్రవీధి నుంచి సుమండి వరకు రోడ్డును త్వరగా పూర్తి చేస్తామన్నారు. దశాబ్దాలుగా ఇరు రాష్ట్రాల ప్రజలు ఎదురుచూస్తున్న అపరిష్కృత అంశాలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. తాగు, సాగునీటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఇరు రాష్ట్రాల ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సమిష్టిగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణాధ్యక్షులు కాళ్ల ధర్మారావు, సాలీనా ఢిల్లీ, కౌన్సిలర్లు తవిటయ్య, కాళ్ల దిలీప్ కుమార్, లీలారాణి, నందికా జాని, కొండా శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు రక్షణ కరువు

రిమ్స్‌లో జూనియర్ డాక్టర్ల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బోధనా కళాశాలలు, ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులకు, వైద్య విద్యార్థులకు రక్షణ కరువైందని ఎపి జూనియర్ డాక్టర్ల సంఘం నాయకులు విమర్శించారు. కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై అత్యాచారాన్ని నిరసిస్తూ ఎపి జూనియర్ డాక్టర్ల సంఘం ఆధ్వర్యాన శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాల ప్రధాన గేటు వద్ద జూనియర్ డాక్టర్లు శుక్రవారం ధర్నా చేపట్టారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, పని ప్రదేశాల్లో రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. ఘటనకు కారకులైన నిందితులతో పాటు కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జూనియర్ డాక్టర్లకు పని ప్రదేశాల్లో రక్షణ కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఘటనపై న్యాయ విచారణకు ఆదేశించాలన్నారు. ధర్నాకు ఎస్ఎఫ్ఐ నాయకులు చందు, రాజు తదితరులు సంఘీభావం తెలిపారు.

ధర్నా చేస్తున్న జూనియర్ వైద్యులు

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం

- గంజాయి అక్రమ రవాణా పూర్తిస్థాయిలో అరికట్టాలి
- సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి : ఎస్‌పి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అపరిష్కృతంగా ఉన్న కేసులపై దృష్టి కేంద్రీకరించి వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేయాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతాల నుంచి గంజాయి అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టాలన్నారు. అపరిష్కృతంగా ఉన్న తీవ్రమైన కేసుల్లో నిశితమైన సాక్ష్యాధారాలతో సమగ్రమైన దర్యాప్తుతో పురోగతి సాధించాలన్నారు. పెండింగ్ గ్రేవ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేసి ఛార్జిషీటు కోర్టులో దాఖలు చేయాలని ఆదేశించారు. డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది తప్పనిసరిగా గ్రామ సందర్శనలు చేయాలన్నారు. ప్రజలతో మమేకమై గ్రామంలో సమస్యలను గుర్తించి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించాలన్నారు. ప్రాథమికస్థాయిలోనే ఆయా వ్యక్తులను ముందస్తుగా బైండోవర్ చేయాలని చెప్పారు. గంజాయి నియంత్రణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, గంజాయి కేసుల్లో అరెస్టు అయిన నిందితుల నుంచి వారికి అమ్మిన, సరఫరా చేసిన వ్యక్తుల సమాచారాన్ని సేకరించి, ఆయా కేసుల్లో వారిని నిందితులుగా చేర్చాలన్నారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. మద్యం, నాటుసారా, గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు జిల్లా ఎస్పీ సూచించారు. సైబర్ నేరాలపై ఫిర్యాదు అందిన వెంటనే తక్షణమే చట్ట ప్రకారం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రాత్రివేళల్లో గస్తీ విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, పాత నేరస్తులను తనిఖీ చేసి నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. హిస్టరీ షీట్స్ ఉన్న వ్యక్తులపై నిఘా ఉంచి వారి ప్రవర్తనను గమనించాలన్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం రద్దీ ప్రదేశాలు, మార్కెట్ ప్రాంతాలు, బ్యాంకులు, కళాశాలల వద్ద విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి అసాంఘిక కార్యకలాపాలు, ఆకతాయిలను కట్టడి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎఎస్‌పి జి.ప్రేమ్‌కాజల్, డిఎస్‌పి బాలచంద్రారెడ్డి, శ్రీనివాసరావు, త్రినాథరావు, శృతి, ఎఒ గోపీనాథ్, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

కవాతు సిబ్బందికి ప్రశంసలు

78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కవాతు ప్రదర్శన చేసి జిల్లా ఆర్మ్‌డ్ పోలీస్ అధికారులు, సిబ్బంది, బ్యాండ్ సిబ్బంది కళాకారులను ఎస్‌పి ప్రశంసించారు. జిల్లా పోలీసు కార్యాలయానికి వారిని పిలిపించి ప్రశంసాపత్రాన్ని అందించి అభినందించారు. మెరుగైన ప్రదర్శనతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారని కొనియాడారు. ప్రశంసాపత్రాలతో పాటు ఉద్యోగి సర్వీస్ రిజిస్టర్‌లో గుడ్ సర్వీస్ ఎంట్రీ నమోదు చేయాలని కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. ప్రశంసాపత్రాలు అందుకున్న వారిలో పరేడ్ కమాండర్, డిఎస్‌పి ఎల్.శేషాద్రి, ప్లటూన్ కమాండర్లు, ఆర్ఎస్ఐలు అక్షయ కుమార్, నీలిమతో పాటు పోలీసు సిబ్బంది, 64 మంది హోంగార్డులు ఉన్నారు.

రెండేళ్లలో ఆఫ్‌షోర్ పూర్తి చేస్తాం

- ఏడాదిలో రైల్వే వంతెన పూర్తి
- వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - పలాస

రెండేళ్లలో ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌ను పూర్తి చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి వంశధార, ఇరిగేషన్, ఆర్అండ్‌బి అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌతు శివాజీ ఎమ్మెల్యేగా ఉన్న హయాంలో రూ.450 కోట్లు మంజూరు చేసుకుని 70 శాతం పనులు పూర్తి కాగా, గత ప్రభుత్వ హయాంలో కేవలం ఏడు శాతం పనులు మాత్రమే చేపట్టిందని విమర్శించారు. మరో రూ.300 కోట్లు ఖర్చు చేస్తే ప్రాజెక్టు పూర్తవుతుందన్నారు. పనులు రేపట్నుంచే ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్వాసితుల సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలన్నారు. ప్రస్తుతం ఆఫ్‌షోర్ పనులు కొనసాగించేందుకు బడ్జెట్‌లో రూ.28 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఆర్అండ్ఆర్ సమస్యల కోసం అవసరమైతే రూ.రెండు కోట్లు అదనంగా ఖర్చయినా వెనుకడుగు వేయబోమన్నారు. ఆరు గ్రామాల నిర్వాసితులు గ్రామాలు, ఆర్ఆర్ కాలనీ ప్రాంతాలు, ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులపై ప్రత్యేక అధికారులను నియమించి పనులు శరవేగంగా సాగే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వంశధార ఆధునీకరణ పనులనూ చేపట్టి శివారు ప్రాంతాలకు సాగునీరు అందిస్తామన్నారు. కాశీబుగ్గ రైల్వే వంతెన పనులు పూర్తి చేసేందుకు రూ.15 కోట్లు అవసరం కాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు మంజూరు చేయించి ఏడాదిలోగా పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్‌డిఒ భరత్ నాయక్, వంశధార చీఫ్ ఇంజినీరు సుగుణాకర్, ఎస్ఇ రాంబాబు, డిఎస్‌పి పి.వి తిరుమలరావు, ఆర్అండ్‌బి ఎస్ఇ జాన్ సుధాకర్, పలాస డివిజన్‌లోని తహశీల్దార్లు, ఎంపిడిఒలు, పలు శాఖల అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి పలు సమస్యలు

తమకు ఆర్ఆర్ కాలనీ కేటాయించినా ఇంతవరకు స్థలం చూపించలేదని, కొంతమందికి నష్టపరిహారం అందలేదని చీపురుపల్లి, రేగులపాడు నిర్వాసితులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీలో తాగునీటి సమస్య, కె.టి రోడ్డు విస్తరణ, వజ్రపుకొత్తూరు మండలంలోని పూడిలంక రోడ్డు పనుల సమస్యలను మంత్రి, కలెక్టర్ దృష్టికి ఎమ్మెల్యే శిరీష తీసుకెళ్లారు. మందస మండలం నల్లబొడ్లూరు కొండను మాజీ మంత్రి అప్పలరాజు మాయం చేశారని, దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌గా ఉండాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి జిల్లా అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నీతిఆయోగ్ సహాయ సహకారాలతో నిర్దేశిత లక్ష్యాలను నిర్ణయించుకుని అన్ని ప్రాథమిక రంగాల్లో అభివృద్ధికి వంద రోజులు, ఏడాది ప్రణాళికలను తయారు చేసినట్లు తెలిపారు. 2047 నాటికి లక్ష్యాలను ఏర్పరచుకొని అధిక వృద్ధిరేటును లక్ష్యంగా ఏర్పరచుకుని గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ప్రణాళికలు రూపొందించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో మౌలిక వసతులు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, నైపుణ్య శిక్షణ, గిడ్డంగుల నిర్వహణ, పునరుత్పాదక ఇంధన వనరులు, పర్యాటకాభివృద్ధి వంటి రంగాల్లో మండలాల భౌగోళిక, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా లక్ష్యాలను మండలాల వారీగా అధికారులు ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డిఒలు సిపిఒ లక్ష్మీప్రసన్న, ఆర్‌డిఒలు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

1108 జిఒను రద్దు చేయాలి

ప్రజాశక్తి - నౌపడ

సంతబొమ్మాళి మండలం కాకరాపల్లిలో మత్స్యకారులు చేస్తున్న ఈస్ట్‌కోస్ట్ థర్మల్ వ్యతిరేక ఉద్యమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సంతబొమ్మాళి మండలంలోని వడ్డితాండ్ర దీక్షా శిబిరం వద్ద కాకరపల్లి ఉద్యమకారులు 5,110 రోజులుగా చేస్తున్న రిలే దీక్షల్లో పాల్గొని శుక్రవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తాండ్ర ప్రకాష్ మాట్లాడుతూ ప్రాజెక్టు కోసం జారీ చేసిన జిఒ నంబరు 1108ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆ భూములను లీజుదారులైన మత్స్యకారులకు పంచాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరారు. ఉత్తరాంధ్ర పోరాట సమితి కన్వీనర్ సన్నశెట్టి రాజశేఖర్ మాట్లాడుతూ జీవన మనుగడ కోసం మత్స్యకారులు, రైతులు చేసిన కాకరాపల్లి ఉద్యమం దేశానికే ఆదర్శమన్నారు. అంతకుముందు కాకరాపల్లి ఉద్యమంలో అశువులు బాసిన జీరు నాగేశ్వరావు, సీరపు ఎర్రయ్య, బత్తిన బారికవాడుకు నివాళ్లర్పించారు.

పేదలకు నాణ్యమైన భోజనం

- అన్న క్యాంటీన్లకు విరాళాలు ఇవ్వాలి
- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, పలాస

పేదలకు రూ.ఐదుకే కడుపు నిండా భోజనం పెట్టే సంకల్పంతో అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద నెలకొల్పిన అన్న క్యాంటీన్‌ను శుక్రవారం ప్రారంభించారు. ముందుగా ఏడురోడ్ల కూడలిలోని కీ.శే ఎన్‌టిఆర్, ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసి, రూ.ఐదుకే నాణ్యమైన భోజనం అందించిందని గుర్తుచేశారు. 2019లో అధికారం చేపట్టిన జగన్ ప్రభుత్వం వాటిని మూసివేసి పేదల పొట్టకొట్టిందని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తుందని అన్న క్యాంటీన్ల ప్రారంభంతో నిరూపితమైందన్నారు. అన్న క్యాంటీన్లు నిరాటంకంగా కొనసాగడానికి ప్రజలు, దాతలు సహకరించి విరాళాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అన్నా క్యాంటీన్ మూతపడిన తర్వాత శ్రీకాకుళం నగరంలో 484 రోజుల పాటు కొనసాగించిన ఎమ్మెల్యే శంకర్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : భోజనం వడ్డిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

పలాసలో కాశీబుగ్గ పాతబస్టాండ్ సమీపంలో అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు. పేదలతో కలిసి టిఫిన్ చేశారు. తొలి రోజు క్యాంటీన్ నిర్వహణకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, వజ్జ గంగాభవానీ ఆర్థిక సహకారం అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, డిఇ కనకరాజు, ఎఇ అవినాష్, టిడిపి నాయకులు ఎల్.కామేశ్వరరావు, జి.సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జీడికి మద్దతు ధర కల్పించాలి

ప్రజాశక్తి - కవిటి

జీడి పంటకు మద్దతు ధర కల్పించి, 80 కేజీల జీడిపిక్కల బస్తాను రూ.16 వేలకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ కోరారు. ఈమేరకు మండలంలోని రామయ్యపుట్టుగలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అశోక్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. పలాస కేంద్రంగా జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేసి, స్థానికంగా జీడిపిక్కల కొనుగోలు పూర్తయిన తర్వాతే విదేశీ పిక్కల దిగుమతికి అవకాశం కల్పించాలని కోరారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం జీడి రైతులకు రుణాలు అందించి రైతువారీ సాగు విస్తీర్ణం నమోదు చేసి, వాతావరణ బీమా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రాంతాల వారీగా జీడి పరిశోధనా కేంద్రాలు ఏర్పాటు చేసి అభివృద్ధి చేసిన నాణ్యమైన జీడి మొక్కలను రైతులకు ఉచితంగా అందించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సంగారు లక్ష్మీనారాయణ, ఎఫ్‌పిఒ అధ్యక్షులు బల్లెడ జయప్రకాష్, బల్లెడ కృష్ణారావు, బల్లెడ శంకరరావు, ఎ.అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు, రైతులు

వికలాంగుల 'స్వాభిమాన్' ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వికలాంగుల సమస్యలపై స్వాభిమాన్ పేరిట ప్రత్యేకంగా నిర్వహించే గ్రీవెన్స్‌ను కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో శుక్రవారం ప్రారంభించారు. పలు పనులపై కలెక్టరేట్ కు వస్తున్న వికలంగుల కోసం ర్యాంపును కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి కోటబొమ్మాలి మండలం కొత్తపల్లికి చెందిన రత్నాల శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం కలెక్టర్, జెసి వినతులు స్వీకరించగా, పలు సమస్యలపై 46 వినతలు వచ్చాయి. శ్రీకాకుళం మండలానికి చెందిన మట్ట నీలం జిల్లాలో అంధుల పాఠశాల, జిల్లా ప్రధాన కేంద్రంలో వికలాంగులకు ప్రత్యేక హోం కావాలని కోరారు.

మందస మండలం సొండిపూడికి చెందిన వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి భాస్కరరావు వికలాంగులకు సదరం ధ్రువీకరణ పత్రాల జారీ సమయంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రిమ్స్ ఆస్పత్రిలో సదరం పరీక్షలు ఉదయం చేయించాలని కోరారు. కోటబొమ్మాళి మండలం కొత్తపల్లికి చెందిన ఆర్.శ్రీనివాసరావు వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను గత ఐదేళ్లలో భర్తీ చేయలేదని, వాటిని భర్తీ చేయాలని కోరారు. జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, వికలాంగుల సంక్షేమశాఖ ఎడి కవిత వినతులు స్వీకరించారు.

పత్రికా ప్రకటన

పాస్ పోర్ట్ పోయింది. శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన **పాతిన రామారావు, S/o** ధర్మారావు పాస్ పోర్ట్ నంబర్ **H1326104** సొంత గ్రామం నుంచి కొర్లాంకు జిరాక్స్ కోసం వెళ్తుండగా మార్గ మధ్యలో పడిపోయింది. ఎవరికైనా దొరికిన యెడల పాతిన రామారావుకి గానీ బారువ పోలీస్ స్టేషన్‌లో కానీ అప్పగించాలని విజ్ఞప్తి...

ఫోన్ నంబర్: 8978355571

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM. O.S.55/2023

Between:
Korada Bhaskara Rao ...Plaintiff
And: **Chilla Sriramulu @ Sriramulu Reddy** ...Defendant

To,
Chilla Sriramulu @ Sriramulu Reddy, S/o Chilla late Appala swamy,Chillapeta village, Hamlet of V.N.Puram, Jeerupalem post, Ranasthalam mandalam, Srikakulam district.

నోటీసు

నా క్లైంట్ శ్రీ కోరాడ భాస్కర రావు వాదిగా, పై తెల్పిన కోర్ట్ వారి ఎదుట, పై నెంబర్ దావాను మీ పై అనగా చిల్ల శ్రీరాములు @ శ్రీరాములు రెడ్డి ప్రతివాదిగా మీ పై రిజిస్టర్డ్ తనఖా పత్రము సొమ్ము రాబట్టుకోనుటకు గానూ, వాజ్యమును వేసి వున్నారు. మీ పై కోర్ట్ వారి ఆర్డర్ ప్రకారము మీ పై ఎన్ని మార్లు పై చిరునామాకు సమన్లు జారీ చేసిననూ, మీరు ప్రతిస్పందిచ నందున, ఈ ప్రకటన ద్వారా మీరు **తేదీ. 6-9-2024న పై తెల్పిన కోర్ట్ వారి ఎదుట ఉదయం 10:30 నిమిషములకు** స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియచేయగలరు. లేని యెడల మీ పరోక్షమున దావా పరిహారం కాగలదు.

నూక శ్రీరామ మూర్తి
అడ్వకేట్,
శ్రీకాకుళం, సెల్: 9989616835

జనరల్ మేనేజర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

'శ్యామ్‌పిస్టన్స్' సమస్యలపై చర్చ

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

శ్యామ్‌పిస్టన్స్ అండ్ రింగ్స్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుతో ప్లాంట్ జనరల్ మేనేజర్ ఎస్.కిషోర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం చర్చించారు. ప్రధానంగా కార్మికులు 30 ఏళ్ల పదవీ విరమణ గడువు పెంచాలని, ఉత్పత్తులు, ఇతర సమస్యలపై ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఇదే విషయంలో కార్మికులకు, యాజమాన్యానికి చర్చలు జరుగుతున్నాయని, ఇదే అంశంపై ఇరువర్గాలు కోర్టును ఆశ్రయించడం జరిగిందని, త్వరలో బోర్డు సమావేశం నిర్వహించి సమస్య పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్మికుల సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు.

రైతులను విస్మరించిన ప్రభుత్వం

ప్రజాశక్తి- పాతపట్నం

మాట్లాడుతున్న రెడ్డి శాంతి

రైతుల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం విస్మరించిందని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. రైతు సంక్షేమమే మా ధ్యేయం అంటూ ఎన్నికల్లో చెప్పుకొచ్చి ఓట్లు వేయించుకొని అధికారం చేజిక్కించుకున్న తర్వాత రైతాంగ సమస్యలు గాలికి వదిలేశారని విమర్శించారు. వరినాట్లు పడుతున్న సమయంలో రైతులకు అవసరమైన ఎరువులు సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి రైతుల ఇంటి వద్దకే ఎరువులను తీసుకుని వెళ్లారన్నారు. ఇప్పుడు సిఎం చంద్రబాబు మాత్రం రైతు భరోసా కేంద్రాలను, ఎరువుల కేటాయింపు పూర్తిగా తగ్గించారన్నారు. ప్రైవేట్ డీలర్లకు ఎరువులు కేటాయించడంతో రైతులు అధిక ధరలకు కొనుగోలు చేసే దుస్థితి నెలకొందన్నారు. రైతుల సాగుకు పెట్టుబడి అవసరమైన తరుణంలో రైతు భరోసా నిధులు చెల్లించకపోవడం దారుణమన్నారు. సాగుకు పెట్టుబడి రైతులు వద్ద లేకపోవడంతో ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీలకు అప్పులుగా తెచ్చి సాగుకు పెట్టుబడి పెట్టాల్సిన దుస్థితి నెలకొందన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి జిల్లాకు చెందిన వారే అయినా రైతాంగానికి ఒరిగిందేమీ లేదన్నారు.

కెనడా ప్రొఫెసర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావు

విపత్తుల నివారణపై దీర్ఘకాలిక ప్రణాళిక

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

భూకంపాలు, వరదలు, అటవీ అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు తీసుకుంటున్న తాత్కాలిక చర్యలు శ్లాఘనీయమైనప్పటికీ బాధితుల సమస్యలు శాశ్వతంగా పరిష్కరించుటకు దీర్ఘకాల ప్రణాళికతో అవసరమని కెనడా తాంప్సన్ రివర్ యూనివర్శిటీకి చెందిన స్కూలు ఆఫ్ సోషల్ వర్క్ అండ్ హ్యూమన్ సర్వీస్ విభాగ ప్రొఫెసర్ బాల నిక్కు అభిప్రాయ పడ్డారు. టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజిమెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఐటి విద్యార్థులతో ఆయన 'ఇన్నోవేటివ్ సొల్యూషన్స్ ఫర్ డిజాస్టర్ మేనేజిమెంట్ హేండిలింగ్' అనే అంశంపై మాట్లాడారు. విపత్తులు జరిగిన వెంటనే సహాయక చర్యలు చేపట్టి పరిస్థితులు కొంత చక్కబడిన తరువాత బాధితుల మానసిక, శారీరక ఆరోగ్య పరిస్థితులపై దృష్టిపెట్టాలన్నారు. విపత్తుకు పూర్వం ఉన్న స్థితికి బాధితులు చేరుకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు విశ్వవిద్యాలయాలు, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులను అనుసంధానం చేసుకొని సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సదస్సులో డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు ఇటువంటి సదస్సులు ఎంతో అవసరమన్నారు. అనంతరం కెనడా ప్రొఫెసర్ డాక్టర్ బాల నిక్కుకు సత్కరించారు.

వృద్ధ దంపతులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

పేదలకు ఆర్థికసాయం

ప్రజాశక్తి- కొత్తూరు

మండలానికి చెందిన శ్రీ భగత్ సింగ్ చారిటబులు ట్రస్ట్ శుక్రవారం రెండు కుటుంబాలకు ఆపన్న హస్తం అందించారు. నివగాంకు చెందిన ఉర్జాన వెంకటరావు, బుజిమ్మ వృద్ధ దంపతులు ఒడిశా నుంచి కొన్నేళ్ల క్రితం వలస వచ్చి పూరీ గుడిసెలో నివాసం ఉంటున్నారు. పింఛను కూడా లేవపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ట్రస్ట్ సభ్యులు మూడు నెలలకు సరిపడా రూ.15 వేలు విలువగల బియ్యం, పప్పులు, నూనె తదితర నిత్యావసర సరుకులు అందించారు. అదే విధంగా కడుం కాలనీకి చెందిన వలురౌతు ఈశ్వరరావు భార్యా, ఇద్దరు కుమార్తెలు, కుమారుడుతో జీవిస్తున్నారు. ఇటీవల కుమారుడు అనారోగ్యం బారిన పడడంతో ఆస్పత్రికి తరలించగా రెండు కిడ్నీలు చెడిపోయాయని వైద్యులు నిర్ధారించారు. ఆస్పత్రికి వెళ్లడానికి, మందులకు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు ట్రస్ట్ దృష్టికి తీసుకురాగా రూ.20 వేలు చెక్కును వైద్య ఖర్చుల నిమిత్తం అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఎస్.హరి, యోగి, పోలినాయుడు, రవి, భగవాన్ పాల్గొన్నారు.

30 మందికి జ్వరాలు

ప్రజాశక్తి- పలాస

మండలం చిన్న నీలావతిలో శుక్రవారం సర్పంచ్ సొర్రా పద్మావతి తిరుపతిరావు, గ్రామ అభ్యుదయ యువజన సంఘం, రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా సుమారు 30 మందికి వైరల్ జ్వరాలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెమ్స్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ విజయ్ కుమార్, జెమ్స్ సూపర్‌వైజర్ ప్రదీప్, ఏరియా కో-ఆర్డినేటర్ రాపాక తిరుపతిరావు, వీరాస్వామి, గోరకల లోకేశ్వరరావు, తెప్పల కేశవరావు, పాతిని శ్యాం, పుచ్చ ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బడుగుల ఆశాజ్యోతి సర్దార్ లచ్చన్న

పలాస : లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే శిరీష

కవిటి : నివాళ్లర్పిస్తున్న యువకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు పోరాడి వారి ఆశాజ్యోతిగా కీర్తి పొందిన వ్యక్తి సర్దార్ గౌతు లచ్చన్న అని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కొనియాడారు. లచ్చన్న జయంతిని పురస్కరించుకుని డే అండ్ నైట్ కూడలిలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పైడిశెట్టి జయంతి, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు మెండ దాసు నాయుడు, పార్టీ మాజీ అధ్యక్షులు చౌదరి బాబ్జి, మాదారపు వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.

స్టార్‌వాకర్స్ ఆధ్వర్యాన

నగరంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్‌వాకర్స్ ఆధ్వర్యాన లచ్చన్న జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఇంటాక్ కో-కన్వీనర్ జగన్నాధం నాయుడు, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు ఇందిరాప్రసాద్, పీజీ గుప్తా, డాక్టర్ జి. నారాయణరావు, బగాది జగదీష్,, నళినీ సుధాకర్, గుడ్ల జగ్గారావు, నాగేశ్వరరావు, శేఖర్, డిఇ గణిరాజు పాల్గొన్నారు.

గాంధీ మందిరంలో

స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనం గాంధీ మందిరంలో లచ్చన్న జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీశయన సంఘం అధ్యక్షులు వంగా మహేష్‌దేవ్, రాష్ట్ర అధ్యక్షులు లోడ అప్పారావు, కొంక్యాన వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పలాస: గౌతు లచ్చన్న 115వ జయంతి వేడుకలను పలాసలో ఘనంగా నిర్వహించారు. గౌతు లచ్చన్న విగ్రహానికి ఎమ ఎమ్మెల్యే శిరీష పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాత గారి ఆశయాలను కొనసాగించడం ఒక బాధ్యతగా భావిస్తామన్నారు. అనంతరం లచ్చన్న అభిమానులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, పి.విఠల్‌రావు, లోడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, కొరికాన శంకర్, సవర రాంబాబు, కొండే నర్సింహులు, దడే నర్సింహులు జోగ మల్లి తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలం కిష్టుపురంలో లచ్చన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో శ్రీ శైన సంఘం నాయకులు బూరెల కృష్ణంరాజు, బూరెల విజయ కృష్ణంరాజు, కుత్తుం లక్ష్మణ్ కుమార్, దువ్వాడ సంతోష్ కుమార్, వడ్డీ యాదగిరి, సాసుమాన చంద్రమౌళి, నిమ్మాడ బాబూరావు, శశి భూషణ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: గౌతు లచ్చన్న 115 వ జయంతి సందర్భంగా రెయ్యపాడులో గౌతు లచ్చన్న విగ్రహం వద్ద మండల టిడిపి ఆధ్వర్యంలో నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు సూరాడ మోహనరావు, మాజీ ఎంపిపిలు గొరకల వసంతస్వామి, మద్దిల చిన్నయ్య, ఉపాధ్యక్షులు అరసవిల్లి ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కర్ణి రమణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నివాళ్లర్పిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

వజ్రపుకొత్తూరు : నివాళ్లర్పిస్తున్న నాయకులు

కవిటి: మండలం దూగానపుట్టుగలో గౌతు లచ్చన్న జయంతి ఘనంగా నిర్వహించారు. లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. జోహార్ లచ్చన్నా జోహార్ అంటూ నినదిస్తూ లచ్చన్న సేవలు కొనియాడారు. కార్యక్రమంలో దివాకర్, సిసింద్రీ, రుద్రయ్య, కష్ణారావు, తిరుపతి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా పట్టణ శివారులో లచ్చన్న ఘాట్ వద్ద స్థానిక ఎమ్మెల్యే అశోక్, సోంపేట, కవిటి ప్రాంతాలకు చెందిన సంఘ పెద్దలు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు దీనబంధు, కార్యదర్శి కె.రాము, కోశాధికారి దానయ్యతో పాటు ఎస్ఎస్‌సేవా సంస్థ అధ్యక్షుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా వ్యాప్తంగా 33 కెవి సబ్‌స్టేషన్లు, ఉపకేంద్రాల పరిధిలో ఉన్న ఫీడర్ల మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సూపరింటెండింగ్ ఇంజినీర్ నాగిరెడ్డి కృష్ణమూర్తి, ఇఇ ఆపరేషన్ ఎస్.భయ్యన్నాయుడు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

నరసన్నపేట: నరసన్నపేట పట్టణంలో శనివారం కొన్ని ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఎఇ కోటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నరసన్నపేట మెయిన్ రోడ్, మారుతి నగర్, లక్ష్మి నగర్, కంబకాయ రోడ్డు, శ్రీరాంనగర్, జయలక్ష్మి నగర్, పచూరి నగర్, సౌభాగ్య లక్ష్మి కళ్యాణ మండపం ఏరియా, శ్రీనివాస్ నగర్, సత్యవరం, విజయలక్ష్మి నగర్ తదితర ప్రాంతాల్లో సరఫరా నిలుపుదల చేయనున్నట్టు తెలిపారు.

నందిగాం: మండలంలోని 33/11 కె.వి నందిగాం సబ్‌స్టేషన్ పరిధిలో తామరపల్లి, లట్టిగాం ఫీడర్ జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నందున సబ్‌స్టేషన్ పరిధిలో నందిగాం, తామరపల్లి, సొంటినూరు, పెంటూరు, కనితూరు, హరిదాస్‌పురం, గొల్లవూరు, దిమ్మలాడ తదితర గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.శంకరరావు తెలిపారు.

మెళియాపుట్టి: విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కెవి ఫీడర్ మరమ్మతులు కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.శంకరరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిచిపోతుందన్నారు. పెద్దపద్మాపురం, మర్రిపాడు, కొసమాల, వసుంధర తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

నౌపడ: నౌపడ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఇఇ శంకరరావు ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపి వేస్తున్నామన్నారు.

మందస: మందస సబ్ స్టేషన్‌లో మరమతులు, నిర్వహణ, 33/11కెవి హరిపురం సబ్‌స్టేషన్ పరిధిలో అంబుగాం ఫీడర్ అనుకొని ఉన్న చెట్లు, కొమ్మలు తొలగించడం జరుగుతుందని, మందస సబ్‌స్టేషన్ పరిధి, 11 కెవి అంబుగాం పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపివేస్తున్నట్టు ఇఇ యోగేశ్వరరావు ప్రకటనలో తెలిపారు.

టెక్కలి రూరల్: మండలంలో బన్నువాడ, మొదుగువలస, అయోధ్యపురం, ఎస్అర్‌కె పురం, దీపావళి పేట గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఇఇ జి.శంకరరావు తెలిపారు.

రికార్డు అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి

లావేరు: లావేరు జెడ్‌పి పాఠశాలలో అటెండర్‌గా పనిచేస్తున్న పట్నాయకుని సుజాతకుమారికి రికార్డు అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి ప్రభుత్వం కల్పించింది. రణస్థలం జెడ్‌పి పాఠశాలకు రికార్డు అసిస్టెంట్‌గా బదిలిచేస్తూ ఆగస్టు 15న జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ నియామకపత్రాన్ని సుజాతకు అందజేశారు. అనంతరం లావేరు జెడ్‌పి పాఠశాల నుంచి రిలీవై రణస్థలం బదిలీపై వెళ్లారు.

జాతీయస్థాయి పోటీలకు క్రీడాకారులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఈ నెల 17, 18, 19 తేదీల్లో కలకత్తాలో జరుగుతున్న జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఇచ్ఛాపురం నుంచి అండర్ 12, అండర్ 14, అండర్ 19 విభాగాల నుంచి మొత్తం 19 మంది శుక్రవారం బయలు దేరారని కొచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ పోటీలు కలకత్తాలో రైఫిల్ ఫ్యాక్టరీ ఇండోర్స్ స్టేడియంలో జరుగుతాయన్నారు. ఇప్పటికే వీరు తైక్వాండోలో అనేక పథకాలు సాధించారన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని అభయం యువజన సేవాసంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో అభయం యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో అభయం ఫుడ్ బ్యాంక్ వార్షికోత్సవం సందర్భంగా 15, 16 తేదీల్లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 75 మంది రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచారు. కార్యక్రమంలో అభయం యువజన సేవా సంఘం కార్యదర్శి లాడి కామేశ్వరరావు, ట్రెజరర్ శ్రీనివాస్ బెహర, సభ్యులు పాల్గొన్నారు.

చెట్లను కాపాడడం బాధ్యత

సోంపేట: మహా వృక్షాలను కాపాడం మన బాధ్యతని పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ వై.కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం పలాసపురం సమీపంలో చెట్లకు రాఖీలు కట్టే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ పుట్టిన రోజు సందర్భంగా మొక్కలు నాటి పెంచి పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులతో పాటు తీర ప్రాంత ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.

గోతులు పూడ్చివేయిస్తున్న సర్పంచ్

గోతులు పూడ్చివేత

బూర్జ: శ్రీకాకుళం-పాలకొండ ప్రధాన రహదారిపై సింగన్న పాలెం వద్ద గోతులు ఏర్పడడంతో అనునిత్యం ద్విచక్ర వాహనాలతో పాటు భారీ వాహనాలు కూడా అదుపు తప్పి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని గ్రామ సర్పంచ్ తురగాపు శ్రీనివాసరావు శుక్రవారం గోతులు కప్పించేందుకు చర్యలు చేపట్టారు. రహదారిపై ఏర్పడ్డ పెద్దపెద్ద గోతులను కప్పించారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టినట్లు శ్రీనివాస్ తెలిపారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ

ప్రింటర్ వారంటీ బుక్‌ను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

నౌపడ: సంత బొమ్మాళి మండలం యమలపేట ఎంపియుపి పాఠశాలలో చదువుకొని వివిధ హోదాల్లో స్థిరపడిన ఉద్యోగులు పాఠశాలకు ప్రింటర్ అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా పాఠశాలలో వేడుకలకు హాజరైన పూర్వ విద్యార్థులు పాఠశాల ప్రింటర్ మరమ్మతులకు గురవ్వడంతో కొత్త ప్రింటర్‌ను సర్పంచ్ ప్రతినిధి ముదిలి సంజీవ్ చేతులమీదుగా హెచ్ఎంకు అందజేశారు. ఉప సర్పంచ్ జగన్నాథరావు, ఉపాధ్యాయులు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నీలావతిలో వైద్య శిబిరం

'ప్రజాశక్తి కథనానికి స్పందన'

ప్రజాశక్తి- పలాస

మండలం నీలావతిలో శుక్రవారం రెంటికోట పిహెచ్‌సి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజాశక్తి దినపత్రికలో గురువారం నీలావతిలో విష జ్వరాలు అనే శీర్షికతో వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. ఎంపిడిఒ ఎన్.రమేష్ నాయుడు, వైద్యాధికారి సునీల్ కుమార్‌తో పాటు వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటించి జ్వరాలకు గల కారణాలపై ఆరా తీశారు. ఇంటింటికీ వెళ్లి పరిసరాలను పరిశీలించారు. ఇంటిలో ఎంత మంది ఉన్నారు, ఎవరికైనా జ్వరాలు ఉన్నాయా లేదా ఇంటింటికీ వెళ్లి అడిగి తెలుసుకున్నారు. చిన్న నీలావతితో పాటు పెద్ద నీలావతిలో వైద్య శిబిరాలు నిర్వహించడం జరిగిందని ఎంపిడిఒ తెలిపారు. గ్రామాల్లో జ్వరాలు తగ్గు ముఖం పట్టే వరకు వైద్య శిబిరాలు కొనసాగుతాయని చెప్పారు. ఇటీవల వర్షాలు కురిసే సమయంలో నీరు నిలిచిపోతుందని, తాగునీటికి ఇబ్బంది వస్తుందని ఆలోచనతో ముందుగా నీటిని కుండీల్లో నిల్వ ఉంచడం ద్వారా దోమలు వృద్ధి చెంది జ్వరాలకు కారణమయ్యాయని మా సర్వేలో తేలిందన్నారు. ప్రతి ఇంట్లో నిల్వ ఉన్న నీటిని పారబోయడం జరిగిందన్నారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కామేశ్వరరావు, రుషి, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నిల్వ ఉన్న నీటిని పారబోయిస్తున్న ఎంపిడిఒ, వైద్యాధికారులు

విద్యార్థులను అభినందిస్తున్న తులసీదాసు రెడ్డి

డిగ్రీ సెమిస్టర్‌లో విద్యార్థుల ప్రతిభ

ఇచ్ఛాపురం: డిగ్రీ 4వ సెమిస్టర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన స్వర్ణభారతి విద్యార్థులను చైర్మన్ చాట్ల తులసీదాసు రెడ్డి అభినందించారు. విడుదలైన డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాల్లో స్వర్ణభారతి డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని చల్లా లిఖిత ఎంపిసిఎస్ విభాగంలో 9.41 పాయింట్లు సాధించి నియోజకవర్గ స్థాయిలో ప్రథమస్థానం కైవసం చేసుకుంది. బి.హర్షిత ఎంపిసి విభాగంలో 9.3, బి.కోమలిక బిజెడ్‌సి విభాగంలో 9.2, వి.నేలవేణి ఎంపిసి విభాగంలో 9.0 పాయింట్లు సాధించారు. వీరికి చైర్మన్ పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. అడ్మినిస్ట్రేటర్ రాము, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.సందీప్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జయప్రకాష్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

సోంపేట: ఇటీవల విడుదలైన డిగ్రీ ద్వితీయ సంవత్సరం నాలుగవ సెమిస్టర్ ఫలితాల్లో స్థానిక సంస్కార భారతి విద్యార్థులు ప్రతిభ చూపినట్లు కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.దాసు తెలిపారు. కళాశాలకు చెందిన బి.సృజన 9.53 పాయింట్లు, బి.అంకిత 9.65 పాయింట్లు, పి.లిఖిత 9.53 పాయింట్లు, వి.వర్షిని 5.35 పాయింట్లతో మార్కులు సాధించినట్లు తెలిపారు. వీరితో పాటు మరో ఐదుగురు విద్యార్థులు 9 పాయింట్లకుపైగా సాధించినట్లు తెలిపారు. వీరికి చైర్మన్ దేవరాజు, ప్రిన్సిపాల్ శ్రీరామమూర్తి, కవిబాబు, ఎఒ పాపారావు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీ

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం (జిఆర్ 1125) లో గురువారం రాత్రి చోరీ జరిగింది. మద్యం దుకాణంలో దొంగలు ప్రవేశించి భద్రంగా ఉంచిన ఇనుపపెట్టెను గునపంతో బద్దలుకొట్టి అందులో ఉన్న రూ.2 లక్షల 3, 830 ఎత్తుకెళ్లిపోయారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం సెలవుదినం కావడంతో శుక్రవారం యదాతథంగా సిబ్బంది వెళ్లి షాపు తలుపులు తీయగా దొంగతనం బయట పడింది. బుధవారం రాత్రి ఈ సంఘటన జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సంఘటన స్థలానికి కాశీబుగ్గ పోలీసులు, శ్రీకాకుళం క్లూస్ టీమ్ సభ్యులు వెళ్లి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. స్వాతంత్ర్య దినోత్సవం ముందు రోజు బుధవారం ఒక్కరోజే మద్యం షాపులో రూ.2 లక్షల 3వేలకుపైగా మద్యం ద్వారా ఆదాయం లభించింది. రాత్రి సమయం 9 గంటలు కావడం, మరుసటిరోజు (గురువారం) సెలవు దినం కావడంతో ఆ నగదు షాపులో ఉన్న ఇనుప లాకర్లో దాచారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు సేల్స్‌మేన్, సంబంధిత సిబ్బంది వచ్చి తలుపులు తీయగా లాకర్ బద్దలు కొట్టి ఉండడాన్ని గుర్తించి ఎక్సైజ్ సిబ్బందికి, కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. షాపు వెనుకభాగం నుంచి దొంగలు ప్రవేశించి లాకర్‌ను గునపంతో కొట్టి లాకర్ తలుపులు తెరచి నగదు తస్కరించారు. షాపులో మద్యం నిల్వలు పట్టుకువెళ్లలేదు. సంఘటనా స్థలానికి కాశీబుగ్గ ఎస్ఐ పారినాయుడు, సిబ్బంది పరిశీలించారు. శ్రీకాకుళం క్లూస్‌టీం వచ్చి వేలిముద్రలు సేకరించారు. బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో ఈ షాపు ప్రక్కనే ఉన్న గోల్డ్‌షాపులో కూడా దొంగతనానికి యత్నించి విఫలం చెందారు. దీంతో అదే వరుసలో ఉన్న ప్రభుత్వ మద్యం షాపులోకి వెళ్లినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. చుట్టుప్రక్కల ఉన్న సిసి కెమేరాలను పోలీసులు నిశితంగా పరిశీలిస్తున్నారు. దీంతో పాటుగా కెటిరోడ్డు ముఖ్యకూడలిలో ఉన్న కెమెరాలు కూడా పరిశీలిస్తున్నారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో అంతరాష్ట్ర దొంగలు సంచరిస్తున్నారనే అనుమానాలకు ఇటీవల జరుగుతున్న దొంగతనాలు బలపరుసున్నాయి. కొద్ది నెలల క్రితం పాతజాతీయ రహదారిపై బ్యాటరీల షాపు, విద్యుత్ పరికరాలు అమ్మకాలు చేసిన షాపుల్లో కూడా ఇటువంటి నేరాలే జరిగాయి. పెద్దగా ఆస్తినష్టం జరగకపోవడంతో ఎవరూ పట్టించుకోలేదు. దీనిపై పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేయాల్సి ఉంది.

షాపును పరిశీలిస్తున్న క్లూస్‌టీం

ఉన్నతస్థాయికి ఎదగాలి

సంతబొమ్మాళి : పాత మేఘవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా మత్స్య కార సహకార సంఘం డైరెక్టర్ సూరాడ జోగారావు అన్నారు. 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సొంతంగా షీల్డ్, నగదు అందజేశారు. హెచ్ఎం యు.డి.వి.ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 2023-24 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో 545 మార్కులతో ప్రథమ స్థానం సాధించిన సుగ్గ సుశీలకు షీల్డ్‌తో పాటు రూ.3 వేలు నగదు అందజేశారు. 543 మార్కులతో ద్వితీయ స్థానం సాధించిన చోడిపల్లి శివకు షీల్డ్‌తో పాటు రూ.2 వేలు నగదు, 539 మార్కులతో తృతీయ స్థానం సాధించిన అర్జాల పూజ, తుంబల సాయి దీపికలకు షీల్డ్‌తో పాటు రూ.వెయ్యి చొప్పున ఇరువురికి అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ జోగారావు ఇదే పాఠశాలలో 15 సంవత్సరాలు సేవ చేశారన్నారు. తన దగ్గర చదువుకున్న విద్యార్థులు ఎంతో మంది ఉన్న స్థాయికి వెళ్లారన్నారు. పాఠశాల విద్యాభివృద్ధికి నిత్యం ఆయన సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి పరపటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి సూరాడ భీమారావు, ఉప సర్పంచ్ మంకు సింహాచలం, పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ గాడి లక్ష్మి, యూత్ లీడర్ యంపల్ల దుర్గా ప్రసాద్, మత్స్యకార నాయకులు సిరిగిడి రాము, నందుపిల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

లారీ క్లీనర్ మృతి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మున్న (ఫైల్)

మండలం జాతీయ రహదారిలో పెద్దబమ్మిడి దాబా వద్ద గురువారం రాత్రి లారీ క్యాబెన్‌పై నుంచి జారిపడి గంజాం జిల్లా భూమకుంప మండలం, అతి గూడకు చెందిన లారీ క్లీనర్ మున్న సంబార్ (35) మృతి చెందాడు. రాజమండ్రి నుంచి కటక్ వెళ్తూ విశ్రాంతి కోసం గురువారం రాత్రి దాబావద్ద అపగా క్లీనర్ గాలి కోసం లారీపై నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో క్యాబెన్‌పై నుంచి కిందకు జారి మృతి చెందాడు. తెల్లవారి డ్రైవర్ లేచి చూడగా క్లీనర్ మున్న మృతి చెంది ఉండడంలో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ షేక్ మహ్మద్ అలీ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం స్థానిక ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

మండలవాసి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

జగదీష్ (ఫైల్)

విజయనగరం సమీపంలో లంభాపట్నం, రాళ్లమల్లపురం గ్రామాల పరిధిలో రైల్వేట్రాక్‌పై మండలం చిన్న హరిశ్చంద్రపురానికి చెందిన ఉప్పాడ జగదీష్ (25) తునాతునకలై అనుమానాస్పదంగా మృతి చెందాడు. జగదీష్ విశాఖపట్నంలో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. విశాఖపట్నంలో ఉండాల్సిన జగదీష్ విజయనగరం పరిధిలోకి ఎందుకు రావాల్సి వచ్చింది. ఇది హత్య లేక ఆత్మహత్య అనే పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తండ్రి సూర్యారావు హైదరాబాద్ తదితర పట్టణాల్లో పెయింటర్‌గా పనిచేస్తుండగా, తల్లి లక్ష్మి వ్యవసాయ కూలీ, చెల్లి స్వప్న డిగ్రీ చదువుతుంది. జగదీష్ మరణవార్త గ్రామంలో తెలియడంతో ఒక్కసారిగా విషాదఛాయలు అలముకున్నాయి. మృతదేహాన్ని విజయనగరం పోస్టుమార్టంకు తరలించినట్లు బంధువులు తెలిపారు.

బెల్లంఊటలు ధ్వంసం

మందస: సోంపేట ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ జైభీమ్ సిబ్బందితో మండలం జన్నివీధి గ్రామ శివార్లలో దాడులు నిర్వహించారు. నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1100 లీటర్ల బెల్లం ఊటలను కనుగొని ధ్వంసం చేశారు. గ్రామంలో ఎవరు నాటుసారా బట్టీలు నిర్వహిస్తున్నారని విచారణ చేసి వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ దాడుల్లో ఎస్ఇబి ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బంది మోహనరావు, కాంతారావు, యోగి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంతులు మృతికి సంతాపం

టెక్కలి: అప్పయ్య పంతులు మరణం జర్నలిజానికి తీరని లోటని ఎంపిపి సరోజనమ్మ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొలితరం జర్నలిస్టుగా పంతులు చేసిన సేవలను కొనియాడారు. టెక్కలి ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు బెండి నర్సింగరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సంతాప సభలో పంతులు కుటుంబానికి ఆర్థికంగా సహకారం అందించేందుకు పలువురు ముందుకు వచ్చారు. స్థానిక ప్రెస్‌క్లబ్ నుంచి రూ.5 వేలు, పలాస ప్రెస్‌క్లబ్ రూ.5 వేలు, టెక్కలి బిజెపి నాయకులు గూన మీనా కుమార్ రూ.వెయ్యి ఆర్థికసాయం ప్రకటించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్‌కుమార్, సిపిఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు, నర్సిపురం శేఖర్, అట్టాడ శ్రీధర్, పాండవుల జగదీష్, రాహుల్‌కుమార్, లింగరాజు పాల్గొన్నారు.

రేపు సరుబుజ్జిలి మండల సమావేశం

సరుబుజ్జిలి : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 18న ఆదివారం జరగనున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ బివిఎస్ ప్రసాదరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపిపి కిల్లి రమాదేవి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి సభ్యులు, అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

కృష్ణదాస్‌పై ఆరోపణలు కక్షపూరితం

పోలాకి: మాజీ ఉప ముఖ్యమంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్‌పై అసత్య ఆరోపణలు, కేసులు పెట్టడం కేవలం కక్షపూరితంగా ఉందని ఎంపిపి ముద్దాడ దమయంతి, భైరాగినాయుడు అన్నారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆడుదాం ఆంధ్రా క్రీడలు నిర్వాహణలో నిధులు దుర్వినియోగమయ్యాయని సిఐడితో విచారణ జరిపించాలని కబడ్డీ జాతీయ పూర్వ క్రీడాకారుడు ఆర్‌డి ప్రసాద్ ఫిర్యాదు చేయడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. కృష్ణదాస్ ఒలింపిక్ అసోసియేషన్‌కు అధ్యక్షుడుగా ఉన్నంత మాత్రాన నిధులు దుర్వినియోగంపై అసత్య ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా వ్యక్తత్వాన్ని చూసి ఇటువంటి ఆరోపణలు మానుకోవాలన్నారు.

నేటి నుంచి పాఠశాలల సముదాయాలు

టెక్కలి: ఉపాధ్యాయుల్లో మెరుగైన బోధన నిమిత్తం నిర్వహించే పాఠశాలల సముదాయాలు శనివారం నుంచి జరగనున్నాయి. ఈ విద్యా సంవత్సరం ఆరంభం నుంచి ఇదే మెట్టమొదటి పాఠశాలల సముదాయం కావడం గమనార్హం. విద్యా సంవత్సరం ఆరంభమై మూడు నెలలు కావస్తున్నప్పటికీ నేటివరకు విద్యార్థులకు ఎటువంటి పరీక్షలు నిర్వహించలేదు. ఈ నెలాఖరు నాటికి ఎఫ్ఎ పరీక్షలు ఉండవచ్చున్న నేపథ్యంలో పాఠశాలల సముదాయాలు నిర్వహించడం విశేషం. కాగా గత ప్రభుత్వ హయాంలో మాదిరిగానే ఈ ప్రభుత్వంలో కూడా రెండు మండలాలకు ఒకచోట పాఠశాలల సముదాయాలు నిర్వహించనున్నారు. శనివారం నుంచి జరగాల్సిన ఈ సముదాయాలు నిర్వహణపై సందిగ్ధత నెలకుంది. శనివారం ఉపాధ్యాయుల పని సర్దుబాటు కార్యక్రమం ఉన్న నేపథ్యంలో శనివారం జరగాల్సిన పాఠశాలల సముదాయం వాయిదా పడవచ్చనే వాదన శుక్రవారం మధ్యాహ్నం వరకు నెలకున్నప్పటికీ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ సూచనల మేరకు శనివారం పాఠశాలల సముదాయం యథావిధిగా ప్రారంభం కానుంది. మొదటి రోజు తెలుగు, గణితం, జీవశాస్త్రం సబ్జెక్టులకు నిర్వహించగా సోమవారం హిందీ, ఆంగ్లం, భౌతికశాస్త్రం, సాంఘిక శాస్త్రం సబ్జెక్టులకు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి కిసోర్స్ పర్సన్‌ల ఎంపిక ఆయా పాఠశాలల హెచ్ఎంలు ఎంపిక చేసుకోనున్నారు.

మొక్కలు నాటుతున్న విద్యార్థులు, సత్యసాయి ప్రతినిధులు

మొక్కలు నాటిన విద్యార్థులు

పాతపట్నం: మండలం తెంబూరులో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో బమ్మిడి శ్రీనివాసరావు పొలంలో సత్యసాయి భక్తులు, బాల వికాస్ విద్యార్థులు శుక్రవారం సత్యసాయి ప్రేమ తరువు కార్యక్రమంలో భాగంగా 150 మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా సత్యసాయి ప్రేమ తరువు ఇన్‌ఛార్జి చంద్రమౌళి, టెక్కలి జోనల్ కన్వీనర్ చంటి, స్థానిక కన్వీనర్ కామేశ్వరరావు, షణ్ముఖరావు, బాలవికాస్ విద్యార్థులు, సాయి భక్తులు పాల్గొన్నారు.

రహదారిపై ఉన్న గోతులు

అధ్వానంగా రహదారి

ప్రజాశక్తి- పాతపట్నం

పాతపట్నం నుంచి తెంబూరు మీదుగా టెక్కలి వెళ్లే రహదారి తెంబూరు వరకు గోతులతో చాలా అధ్వానంగా తయారైంది. ఆ రహదారిపై వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడుతున్నామని స్థానికులు, వాహన చోదకులు వాపోతున్నారు. ప్రభుత్వాలు మారినా రహదారుల పరిస్థితి మారడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడితే అంతే సంగతులు గోతుల నిండా నీరు చేరుకుపోయి ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా ఉంటుందని, తద్వారా రహదారి ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని, ఇటీవల కాలంలో ద్వారకాపురం వద్ద రెండు ప్రమాదాలు జరిగాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేపట్టాలని తెంబూరు, గంగువాడ, లాబర, పెద్ద లోగిడి తదితర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రహదారిపై ఏర్పడిన గొయ్యి

పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని బోరుభద్ర నుంచి పాత మేఘవరానికి వెళ్లే బిటి రోడ్డులో ప్రమాదం పొంచి ఉంది. మరువాడ పంచాయతీ చిలక కూడలి వద్ద వంతెన శిథిలావస్థ చేరుకోవడంతో రోడ్డుకి పెద్ద రంధ్రం ఏర్పడింది. వంశధార కాలువ నుంచి తంపర పొలాలకు సాగునీరు అందించడానికి 30 ఏళ్ల క్రితం కాలువపై వంతెన ఏర్పాటు చేశారు. సాగునీరు వెళ్తు... ఈ రంధ్రం పెద్దదయితే పూర్తిగా రవాణా వ్యవస్థ నిలిచి పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి పెద్ద ప్రమాదం జరగ కుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి- పర్లాకిమిడి

గజపతి జిల్లా పర్లాకిమిడిలో కేరళ రాష్ట్రం వయనాడ్ బాధితుల కోసం సిపిఎం నాయకులు విరాళాలు సేకరించారు. మొత్తం రూ.3,500 సేకరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి దొండపాణి రైతో, జిల్లా కమిటీ సభ్యులు ముచ్చి బంగారు, గోకులో, రైతు సంఘం నాయకులు సునామో మండల్, సభ్యులు శ్రీను బెహరా తదితరులు పాల్గొన్నారు.

తిరుమల గాన కచేరికి అవకాశం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

తిరుమల తిరుపతి దేవస్థానంలో ఇచ్ఛాపురం కళాకారులు వెంకటేశ్వర పట్నాయక్ (చిన్నాగురుస్వామి) బృందం గాన కచేరికి అవకాశం లభించింది. తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో కళాకారులు చిన్నా గురుస్వామి భక్తి రంజని కార్యక్రమం ఈనెల 19న శ్రావణ రాఖీ పౌర్ణమి శుభవేళ వెంకటేశ్వర స్వామి శ్రవణా నక్షత్రం రోజున చక్కటి అవకాశాన్ని తిరుపతి దేవస్థానం కల్పించింది. వెంకటేశ్వర భక్తి రంజని చిన్నా గురుస్వామి బృందానికి హరినామ అఖండ సంకీర్తన కార్యక్రమంలో అవకాశాన్ని కల్పించారు. ఈ భక్తి రంజని కార్యక్రమంలో వెంకటేశ్వర పట్నాయక్ జయలక్ష్మి దంపతులు, లాభాల వెంకటరావు మాస్టర్ సుమలత దంపతులు, బచ్చు గుణవతి, ధనపాన హైమావతి, అనపాన కుమారి, కీబోర్డు కళాకారులు హేమంత్ కుమార్ బాడిత్య, తబలా సహకారం నిత్యానంద్ బాడెత్యాలు పాల్గొంటున్నారు. శ్రీవారి సన్నిధిలో కళాకారులందరికి ఈ అవకాశం రావడం ప్రభుత్వానికి, ఆలయ సిబ్బందికి చిన్నా గురు స్వామి దంపతులకు ధన్యవాదాలు తెలిపారు.

తిరుమలకు వెళ్తున్న వెంకటేశ్వర భక్త రంజన్ బృందం

సేంద్రీయ సాగు పద్ధతులతో మేలు

కంచిలి : పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

కంచిలి: వ్యవసాయ సాగులో సేంద్రీయ పద్ధతులను ఉపయోగించడం వలన రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కె జగన్మోహనరావు అన్నారు. శుక్రవారం మండలంలోని అంపురంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవామృతం పిచికారి, కోను వీడర్ ద్వారా కలుపు తీయడం వంటి ప్రక్రియలపై రైతులకు అవగాహన కల్పించారు. సాగులో సేంద్రీయ పద్ధతుల వలన కలిగే ప్రయోజనాలను ఎఓ ధనంజయం వివరించారు. వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొత్తూరు: మండలం గూనభద్రలో శుక్రవారం ఎంటి సూర్యనారాయణ, ఆదర్శ రైతు అంపిలి బుచ్చిబాబు ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వరుస క్రమంలో నాట్లు వేయడం వలన దోమపోటు నివారించవచ్చునని, సూర్య కిరణాలు నేరుగా దుబ్బులకు తగిలి పిలకలు కూడా పెరుగు తాయన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి రవి, భూదేవి, చిన్నా, మొఖలింగం, రైతులు పాల్గొన్నారు.

గుంతలో దిగబడిన ఇసుక లారీ

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండల కేంద్రం సమీపంలో అలికాం - బత్తిలి ప్రధాన రహదారిపై శుక్రవారం విశాఖపట్నం వైపు వెళ్లే ఇసుక లారీ ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద నున్న గుంతలో దిగబడడంతో చాలాసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అనంతరం జెసిబి సహాయంతో లారీని తొలగించడానికి తీవ్ర ప్రయత్నాలు చేసిన సమయంలో ప్రధాన రహదారిలో వాహనాలు బారులు తీరాయి. జిల్లా కేంద్రం నుంచి ఒడిశా వైపు అలాగే ముఖ్యమైన వివిధ ప్రాంతాలతో పాటు అంతర్రాష్ట్ర రహదారిగా రాకపోకలు సాగిస్తున్న ఈ రహదారిలో ప్రతిరోజు వాహనాలు గుంతల్లో ఇరుక్కుపోవడం సర్వ సాధారణంగా మారిపోయిందని పలువురు వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిపై ప్రయాణించాలంటే వాహనదారులు బెంబేలెత్తి పోతున్నారు. రోడ్లు భవనాల శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గుంతలో దిగబడిన లారీని తొలగిస్తున్న జెసిబి

కిరణ్‌కుమార్‌కు పార్టీ కండువా కప్పుతున్న షర్మిల

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

విజయవాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆంధ్ర రత్న భవన్‌లో పిసిసి అధ్యక్షురాలు షర్మిల సమక్షంలో డాక్టర్ పూడి కిరణ్ కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈయన గతంలో విద్యార్థి సంఘ నాయకుడిగా విద్యార్థుల సమస్యల పరిష్కార మార్గం కోసం అనేక ధర్నాలు, ఉద్యమాలు చేశారు. నిరుద్యోగ సమస్య నిర్మూలించాలి, పరిశ్రమలు స్థాపించాలి అన్న నినాదంతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం నుంచి స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కావాలంటే, పేద ప్రజలకు, రైతులకు న్యాయం జరగాలంటే భవిష్యత్‌లో భారత దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని అందుకే పార్టీలో చేరానన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలం తమ్మి నాయుడుపేటలో జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి రేవతి ఆధ్వర్యంలో గ్రామంలో ప్రకృతి వ్యవసాయం సాగుచేస్తున్న రైతులతో సమీక్ష కార్యక్రమం నిర్వహించారు. రీజనల్ ప్రకృతి వ్యవసాయ అధికారులు ప్రకాష్, హేమ సుందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు ఎలా సాగు చేస్తున్నారు, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు ఉన్న అవగాహన అంశాలపై మాట్లాడి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ డిపిఎం ధనుంజయ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శివకృష్ణ, బాబాజీ, శ్రీనివాస్, గోవింద్ రెడ్డి, శివాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో శుక్రవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులు, వర్షానికి చిన్న హంస వద్ద ఆరు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. పెద్ద లక్ష్మీపురం తదితర ప్రాంతాల్లో ఈదురు గాలులకు చెట్లు నేలకొరిగాయి. దీంతో గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.


నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

పౌష్టికాహారం అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తలసేమియా బాధిత చిన్నారులకు చిరంజీవి అభిమానులు పౌష్టికాహారం కిట్లు, పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. సినీనటుడు చిరంజీవి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని అభిమాన సంఘం ఆధ్వర్యాన నగరంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం వీటిని అందజేశారు. కార్యక్రమంలో చిరంజీవి అభిమాన సంఘం నాయకులు తైక్వాండో శ్రీను మాట్లాడుతూ తలసేమియా బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో న్యూట్రీషియన్ కోచ్ నాగరాజు, మజ్జి గౌతమ్, గోవింద, పుక్కల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న శ్రీను